క్లుప్తంగా

నేడు తై బజార్ వేలం

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలో వారం తపు సంత (తై బజార్) నిర్వహణకు శనివారం వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి స్వప్న తెలిపారు. ఉదయం 10 గంటల లోపు వేలంలో పాల్గొనదలిచిన వారు రూ.10 వేలు డిపాజిట్, లేదా నగదు రూపంలో గ్రామ పంచాయతీలో చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. ఈ అవకాశాన్ని కుకునూరుపల్లితో పాటు చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పొద్దు తిరుగుడులో సస్యరక్షణ



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చిన్నకోడూరు(సిద్దిపేట): పొద్దుతిరుగుడు సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు నందీశ్వర్, నిహారిక పిలుపునిచ్చారు. మండల పరిధిలోని మాచాపూర్‌లో రైతులు సాగుచేస్తున్న పొద్దుతిరుగుడు పంటలను శుక్రవారం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం పలు సూచలను చేశారు. తక్కువ కాలం, తక్కువ నీటితో పొద్దు తిరుగుడు సాగు చేయవచ్చని చెప్పారు. గంధకం వాడటం వల్ల గింజ బరువు పెరిగి, నూనె శాతం వృద్ధి చెందుతుందని, ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని చెప్పారు. పొద్దుతిరుగుడు పంటసాగులో యాజమాన్యం, మెలకువలు, నూనె గింజల ప్రాముఖ్యం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో ఎఫ్‌పీఓ చైర్మన్ వెంకట్‌రెడ్డి, వైస్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డైరెక్టర్‌లు, ఏఈఓ జమీల్, రైతులు పాల్గొన్నారు.

మల్లన్నను దర్శించుకున్న జగదీశ్వర్ గుప్తా



మల్లన్న సన్నిధిలో జగదీశ్వర్ గుప్తా

కొమురవెల్లి(సిద్దిపేట): ఆర్యవైశ్య సంఘం నేత తడక జగదీశ్వర్‌గుప్తా శుక్రవారం కుటుంబ సమేతంగా మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి వేదపండితులు ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాలు అందజేశారు.

బీజేపీకే ప్రజల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసిగిపోయి బీజేపీకి మద్దతు ఇస్తున్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరి శంకర్ అన్నారు. మండల పరిధిలోని కొండెంగలకుంట, కమ్మర్లపల్లిలో జరుగుతున్న పెద్దమ్మ కల్యాణోత్సవాల్లో శుక్రవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ యేడాదిన్నర పాలనలో కాంగ్రెస్ ప్రజలకు చేసింది శూన్యమని, స్థానిక ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలోసంతోష్ కుమార్, వెంకటేశం, జనార్దన్, శ్రీనివాస్, సునీల్, రామచంద్రం, యాదగిరి, రాజు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ



పెద్దతండాలో భూమిపూజ చేస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పెద్దతండా, చౌడుతండాల్లో శుక్రవారం సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ నాయకులు ధరావత్ తిరుపతినాయక్, గుగులోతు భాస్కర్ నాయక్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవతో రోడ్ల నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయన్నారు. తండాల్లో సీసీ రోడ్ల నిర్మించడమే లక్ష్యమని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కొండపాక(గజ్వేల్): ముగ్గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు త్రీటౌన్ ఎస్ఐ మల్లేశం తెలిపారు. మండల పరిధిలోని జప్తినాచారం మధిర దోమలోనిపల్లి శివారులో కొందరు పేకాడుతున్నారన్న సమాచారం మేరకు శుక్రవారం రాత్రి దాడిచేశారు. వారి వద్ద నుంచి రూ.12,360, మూడు సెల్ ఫోన్లు, మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారని చెప్పారు.

బావులే బతికిస్తున్నయ్

- నేటికీ వాటితోనే వ్యవసాయం
- 18 బావులు 40 ఎకరాల సాగు



బావుల కింద సాగవుతున్న వరి పంట


జగదేవ్‌పూర్(గజ్వేల్): తాతల కాలం నాడు తవ్విన బావులే నేటికీ సాగునీరు అందిస్తున్నాయి. బోర్ల కాలం వచ్చినా.. ఇప్పటికీ ఆ బావులే పంటలకు జీవనధారంగా మారాయి. ప్రస్తుత పరిస్థితుల్లో బావులే రైతులను ఆదుకొంటున్నాయి. బావుల కింద వరి, మొక్కజొన్న లాంటి పంటలు సాగవుతున్నాయి.

17 బావులు.. 40 ఎకరాలు

తిగుల్, నిర్మల్ నగర్, అలిరాజ్‌పేట గ్రామాల్లో ప్రస్తుతం 17 వ్యవసాయ బావులు వినియోగంలో ఉన్నాయి. దశాబ్దాల కాలం నుంచి బావులపై ఆధారపడే రైతులు వ్యవసాయం చేస్తున్నారు. తిగుల్‌లో ఒకే దగ్గర ఏడు వ్యవసాయ బావులతో పాటు మరో ఆరు బావులు ఉన్నాయి. అలాగే నిర్మల్‌నగర్‌లో రెండు బావులు, అలిరాజ్‌పేటలో రెండు బావులు ఉన్నాయి. బావుల కింద యాసంగిలో 34 ఎకరాలలో వరి, 6 ఎకరాల్లో మొక్కజొన్న సాగవుతోంది.

ఊటలను బట్టి పూడికతీతలు

వర్షాకాలంలో బావుల్లో నీరు ఎక్కువగా ఉంటుంది. ఎండా కాలంలోనే నీరు తగ్గుతుందని రైతులు చెబు తున్నారు. బావుల్లో ఊటను బట్టి పూడికతీత పనులు చేపడతారు. కొన్ని బావుల్లో పది పదిహేనేళ్లయినా పూడిక తీయడం లేదు. ఊటలు తగ్గిన సమయంలో క్రేన్ సహాయంతో మట్టిని తీయడం వల్ల ఊటలు బాగా పెరుగుతాయని అన్నదాతలు తెలిపారు.



తిగుల్‌లో వ్యవసాయ బావిలో నీరు



బావి నుంచి నీరు పోస్తున్న రైతు

రెండెకరాలు పండిస్తున్నా..



తాతల కాలం నాటి వ్యవసాయ బావే సాగునీటికి దిక్కు. 60 యేళ్లకు పైగా నుంచి బావుల ద్వారానే పంటలు పండిస్తున్నాం. బావి కింద రెండు ఎకరాల నుంచి మూడెకరాల వరకు పారుతుంది. ఈ సారి భూగర్భజలాలు తగ్గడంతో పూడిక తీసినా. బావులే వ్యవసాయానికి ఆధారంగా మారాయి.

– ఎల్లారెడ్డి, రైతు, తిగుల్ గ్రామం

కూడవెల్లి వాగులోకి నీరు వదలాలి



కొండపోచమ్మసాగర్ దగ్గరలోనే ఉంది. గతంలో కంటే ఈ సారి బావుల్లో నీరు తగ్గింది. కొండపోచమ్మ సాగర్ కాలువ ద్వారా కూడవెల్లి వాగుకు నీరు వదిలితే బావుల్లో నీటిశాతం పెరుగుతుంది. చివరి తడితో వరి పంట పడుతుంది.

– బాల్‌రెడ్డి, రైతు, తిగుల్ గ్రామం

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- టిప్పర్లతో తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు



టిప్పర్‌లోకి మట్టిని లోడ్ చేస్తున్న జేసీబీ

సిద్దిపేటరూరల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమార్కులు మట్టిని యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. మండల పరిధిలోని ఇర్కోడ్ గ్రామ శివారులో ఐదు రోజుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పెద్ద ఎత్తున టిప్పర్లు చక్కర్లు కొడుతుండడంతో ప్రజలు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే అక్రమంగా మట్టిని తరలిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మండల పరిషత్ భవన నిర్మాణానికి నిధులు

హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు

అక్కన్నపేట(హుస్నాబాద్): స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవన నిర్మాణానికి రూ.1.5 కోట్లు మంజూరు చేస్తూ శుక్రవారం పంచాయతీ రాజ్ శాఖ ఉత్తర్వులను జారీచేసింది. దాదాపు ఎనిమిదేళ్ల కిందట అక్కన్నపేట మండలం ఏర్పాటుకాగా అప్పటి నుంచి సొంత భవనాలు లేక అరకొర సౌకర్యాల మధ్య కార్యాలయాలను నెట్టుకొస్తున్నారు. ఈ క్రమంలో పక్కా భవనం నిర్మాణానికి నిధులు మంజూరు కావడంపై మంత్రి పొన్నం ప్రభాకర్‌కు మండల ప్రజలు, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

రెండు రోజుల్లో శంకుస్థాపన?

ఉగాది పర్వదినం తర్వాత రెండు, మూడు రోజుల్లో ఎంపీడీఓ కార్యాలయ భవన నిర్మాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే మండల కేంద్రంలోని సర్వే నంబరు 387లో సమీకృత భవనాల నిర్మాణానికి ఐదెకరాల ప్రభుత్వ భూమిని గత ప్రభుత్వం హయాంలోనే సేకరించారు. దీంతో ఎనిమిదేళ్ల భవన నిర్మాణ కల ఎట్టకేలకు తీరనుంది.

హుస్నాబాద్‌లో బంజారాల సంబురాలు



సీఎం రేవంత్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్న బంజారాలు

హుస్నాబాద్: రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో బంజారా భాష(గోర్ బోలి)ను చేర్చడం కోసం అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి తీర్మానం ప్రవేశపెట్టి ఆమోదించడంతో గిరిజన సంఘాల నాయకులు శుక్రవారం సంబురాలు జరుపుకొన్నారు. రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచారు. బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాములు నాయక్, ఎస్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు చొరవతో తీర్మానం ఆమోదించారని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుపతి నాయక్, ప్రొఫెసర్ వీరన్న, నాయకులు రమేశ్ నాయక్, లావుడ్యా వీరన్న నాయక్, బీక్యా నాయక్, కైలు నాయక్, సరోజన, రాజు నాయక్ తదితరులు ఉన్నారు.

పేదలకు వరం సీఎం సహాయనిధి

కాంగ్రెస్ నేత శ్రీనివాస్‌రెడ్డి



ఎల్‌ఓసీని అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని తుక్కాపూర్‌కు చెందిన శివ్వ విఠల్‌కు మంజూరైన రూ.60 వేల చెక్కు, అలాగే జప్తిలింగారెడ్డిపల్లికి చెందిన పట్నం ఎల్లయ్యకు మంజూరైన రూ.2 లక్షల ఎల్‌ఓసీని శుక్రవారం ఆయన అందజేశారు. అనంతరం వెంకట్రావుపేటలో రూ.10 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. వెంకట్రావుపేటలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ భవనం నిర్మించాలని కోరుతూ మాల సంఘం నాయకులు శ్రీనివాస్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు విజయ్‌రెడ్డి, రాంరెడ్డి, కొండల్ రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, గ్రామ మత్స్యసహకార సంఘం అధ్యక్షుడు నరేశ్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు నరేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, అనిల్, రాములు, సత్యం, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సహకరించాలి

మిరుదొడ్డి(దుబ్బాక): గ్రామాల అభివృద్ధికి పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరు సహకరించాలని శ్రీనివాస్ రెడ్డికోరారు. ఆల్వాలలో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. సీసీ రోడ్ల అభివృద్ధికి రూ.15లక్షల మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో కిష్టయ్య, రాజు, హర్షద్, సత్యనారాయణ రెడ్డి, మల్లేశం, ఏదుల్, నాగుల్ తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మకు బోనం



బోనాలతో తరలి వస్తున్న మహిళలు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ మాల కులస్తులు గ్రామ దేవత పొచమ్మకు శుక్రవారం బోనాలు నిర్వహించారు. ప్రతియేటా ఉగాదికి ముందు మాల కులస్తులు అమ్మవారికి బోనాలు నిర్వహించడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో మహిళలు బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ర్యాలీగా ఆలయం వరకు తరలి వెళ్లారు. నైవేద్యం సమర్పించి కుటుంబాలతో మొక్కులు చెల్లించారు.

ముస్లింలకు రంజాన్ తోఫా



చేర్యాల(సిద్దిపేట): రంజాన్ తోఫా అందజేస్తున్న ఏకానందం తదితరులు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ఆకునూరుకు చెందిన ముస్లింలకు శుక్రవారం రంజాన్ తోఫా అందజేశారు. రంజాన్ పండుగను పురస్కరించుకొని ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఉల్లెంగుల ఏకానందం ఆధ్వర్యంలో గ్రామంలోని 36 కుటుంబాలకు శుక్రవారం రంజాన్ తోఫా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలంతా ఎంతో నిష్టతో ఉంటారని, వారిని అల్లా అనుగ్రహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశం, దాసు, బాలరాజు పాల్గొన్నారు.

26వ వార్డులో..

సిద్దిపేటజోన్: స్థానిక 26 వార్డులో ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్స్ మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో ప్రతియేటా రంజాన్ కిట్ల పంపిణీ జరిగేదని, కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కనక రాజు, కౌన్సిలర్లు ప్రవీణ్, వజీర్ తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక రంజాన్



దుబ్బాక: ముస్లింలకు స్వీట్ తినిపిస్తున్న నాయకులు

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

దుబ్బాక: మతసామరస్యానికి రంజాన్ పండుగ ప్రతీకంగా నిలుస్తుందని తహసీల్దార్ సంజీవ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో స్థానిక రజనీకర్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం నియోజకవర్గంలోని ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దుబ్బాక మజీద్ కమిటీ అధ్యక్షుడు ఖలీల్, మిరుదొడ్డి, భూంపల్లి-అక్బర్‌పేట తహసీల్దార్లు ఉదయశ్రీ, మల్లికార్జున్, ఎంఈఓ ప్రభుదాసు, మిరుదొడ్డి నయాబ్ తహసీల్దార్ సందీప్ కుమార్, ఆర్ఐ నరేందర్, ముస్లిం మత పెద్దలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి సర్కార్ కృషి

సిద్దిపేటజోన్: ముస్లింల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఈద్గా మైదానంలో ప్రభుత్వ పరంగా ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత సామరస్యానికి సిద్దిపేట ప్రతీక అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సలీమ్, పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమాం నాయకులు మహేందర్, వహీద్ ఖాన్, కలిమొద్దీన్, యాదగిరి, లక్ష్మి, కౌన్సిలర్లు రియాజ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లిలో..

కొమురవెల్లి(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్లింలకు అయినాపూర్‌లో బీఆర్‌ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బొంగు రాజేందర్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల స్నేహం, ఆత్మీయ సంబంధాలు బలపడతాయన్నారు.

జామా మసీద్‌లో..

హుస్నాబాద్: రంజాన్ సందర్భంగా మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్ ఆధ్వర్యంలో జామా మసీద్‌లో శుక్రవారం ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. కార్యక్రమంలో వాల నవీన్, జామా మసీద్ అధ్యక్షుడు బాషుమియా, ప్రధాన కార్యదర్శి ఎండీ హుస్సేన్, నాయకులు అయూబ్, దస్తగీర్, షబ్బీర్ తదితరులు ఉన్నారు.

వెంకట్రావుపేటలో..

తొగుట(దుబ్బాక): ఇఫ్తార్ విందు మతసామరస్యానికి ప్రతీక అని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం అన్ని మతాలను గౌరవించిందన్నారు.

అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో నిర్మాణాలు సురక్షితం



మేస్త్రీకి బీమా పత్రాన్ని అందజేస్తున్న శ్రీకాంత్

మిరుదొడ్డి(దుబ్బాక): సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న వికాట్ గ్రూపునకు చెందిన భారతి సిమెంట్ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌తో భవనాలు దృఢంగా, సురక్షితంగా ఉంటాయని టెక్నికల్ అధికారి వి.శ్రీకాంత్ అన్నారు. స్థానిక మణికంఠ ట్రేడర్స్ ఆధ్వర్యంలో తాపీ మేస్త్రీలకు శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిమెంట్ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం, ఇంటి నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. పాల్గొన్న మేస్త్రీలకు లక్ష రూపాయల ప్రమాద బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వికాట్ సంస్థ 13 దేశాలలో విస్తరించి ఉందని, ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో కూడా విడుదల చేసిందన్నారు. భారతీ అల్ట్రాఫాస్ట్ సిమెంట్‌లో మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే నిర్మాణ ప్రక్రియ చాలా వేగవంతంగా పూర్తవుతుందని చెప్పారు. కార్యక్రమంలో మార్కెటింగ్ అధికారి ఎస్.తిరుపతి, డీలర్ పి.మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. రథప్రతిష్ఠ మహోత్సవం



విమాన రథం వద్ద పూజలు నిర్వహిస్తున్న రుత్వికులు

- విమానరథంపై శ్రీలక్ష్మీనారసింహులు
- తెల్లవారు జామున ఊరేగింపు

వర్గల్(గజ్వేల్): నాచగిరి బ్రహ్మోత్సవాలు శిఖరాగ్రానికి చేరాయి. శుక్రవారం రాత్రి బ్రహ్మోత్సవాల్లో కీలకమైన రథప్రతిష్ఠోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ ఈఓ విశ్వనాథశర్మ పర్యవేక్షణలో రుత్విక్కులు, అర్చక వేదపండితులు విమాన రథ ప్రతిష్ఠ జరిపి, హోమం, రథబలి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శ్రీలక్ష్మీ నృసింహస్వామి గరుడారూఢులై దివ్య విమాన రథం అధిష్ఠించి భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు విమానరథంపై ఊరేగింపు

శనివారం తెల్లవారుజామున 5.30 గంటలకు శ్రీలక్ష్మీనృసింహ స్వామి దివ్యవిమాన రథంపై పుర వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. ఈ మహోత్సవం తిలకించేందుకు భక్తుల తాకిడి మొదలైంది. ఆలయ సత్రాలు, ప్రైవేటు అతిథి గృహాలు నిండిపోయాయి. క్షేత్రం నలుదిశల యాత్రికుల తాత్కాలిక గుడారాలు వెలిశాయి.

సంక్షిప్త వార్తలు

◆ మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో ఏడుగురు పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా విచారణ జరిపిన న్యాయమూర్తి శుక్రవారం రూ.11,500 జరిమానా విధించినట్లు సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

◆ న్యాయవాదులకు అండగా ఉంటా..

సిద్దిపేటకమాన్: తనను గెలిపించిన న్యాయవాదులకు అండగా ఉంటానని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తాటికొంట రమేశ్ అన్నారు. అధ్యక్షుడిగా గెలిచిన సందర్భంగా బార్ అసోసియేషన్ సభ్యులు అతడిని శుక్రవారం అభినందించారు. ప్రధాన కార్యదర్శి రమేశ్, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, న్యాయవాదులు పత్రి ప్రకాశ్, యాదగిరి, సాయిబాబ, హరిహరరావు, కల్యాణి, ఫణి తదితరులు పాల్గొన్నారు.

◆ సన్న బియ్యం పంపిణీ తప్పనిసరి

బెజ్జంకి(సిద్దిపేట): ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభిస్తున్న సన్న బియ్యం పథకాన్ని ఎప్రిల్ నుంచి అమలు చేయాలని ఆర్ఐ సుహాసిని డీలర్లకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రతి లబ్ధిదారుడికి సన్న బియ్యం అందించాలన్నారు. వెంకటేశం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

◆ నిర్వాసితులను ఆదుకోవడంలో విఫలం

గజ్వేల్‌రూరల్: బడ్జెట్ కేటాయింపుల్లో మల్లన్నసాగర్ భూ నిర్వాసితులను ఆదుకోవడంలో అధికార, ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బండ్ల స్వామి శుక్రవారం ఆరోపించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాల్లో నిర్వాసితులకు సంబంధించి బడ్జెట్ కేటాయింపులు ఉంటాయని ఆశించినప్పటికీ అడియాశలే అయ్యాయన్నారు. ఇప్పటికైనా నిర్వాసితులకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

◆ వార సంత వేలం వాయిదా

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకిలో ప్రతి సోమవారం నిర్వహించే పశువులు, కూరగాయల సంతకు వేలం పాటలు మరో సారి వాయిదా పడ్డాయి. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు వేలం ఆదాయం రాకపోవడంతో వాయిదా వేసినట్లు ఎంపీఓ మంజుల తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి ప్రణీత్‌రెడ్డి పాల్గొన్నారు.

◆ 31న తై బజారు వేలం

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా తైబజార్ విక్రయాలకు 31న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ప్రభాకర్, ఏఓ పీవీ శర్మ శుక్రవారం ఒక ప్రకటలో పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.25 వేలు దరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు.

◆ గంజాయి రహిత జిల్లానే లక్ష్యం: ఎస్ఐ

వర్గల్(గజ్వేల్): జిల్లాను గంజాయి రహితంగా మార్చుకుందామని బేగంపేట ఎస్ఐ మహిపాల్ రెడ్డి అన్నారు. మండలంలోని నెంటూరులోని వివిధ దుకాణాలను, అనుమానిత ప్రాంతాలను నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయి రహిత జిల్లా కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.

◆ ఆస్పత్రిని సందర్శించిన ఆర్ఎంఓ

హుస్నాబాద్: పర్కాల ఏరియా ఆస్పత్రి ఆర్ఎంఓ డాక్టర్ బాలకృష్ణ శుక్రవారం హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. వైద్య సేవలు, ఆస్పత్రి పచ్చదనం, పరిశుభ్రతను పరిశీలించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమేశ్ రెడ్డి, గైనకాలజిస్ట్ డాక్టర్ మౌనిక పాల్గొన్నారు.

◆ ఎంపీడీఓ, ఎంపీఓల నియామకం

మద్దూరు(హుస్నాబాద్): నూతనంగా ఏర్పాటైన దూళ్మిట్ట ఎంపీడీఓ, ఎంపీఓలను నియమిస్తూ శుక్రవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. ఎంపీడీఓగా మద్దూరు మండల ఎంపీఓ వీరరాజు, ఎంపీఓగా మద్దూరు మండల గ్రేడ్ వన్ పంచాయతీ కార్యదర్శి గద్ద వెంకటేశ్వర్లును నియమించినట్లు ఎంపీడీఓ రామ్మోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ ఉపాధి కూలీలకు సౌకర్యాలు కల్పించండి

సిద్దిపేటరూరల్: ఉపాధి హామీ పనుల వద్ద కూలీలకు కనీస సౌకర్యాలు కల్పించాలని ఉపాధి హామీ ఏపీఓ కిషన్‌రాజ్ ఆదేశించారు. ఇర్కోడు గ్రామంలో భూమి చదును చేస్తున్న పనులను, నర్సరీని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పనుల వద్ద కూలీలకు నీడ, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్, మెడికల్ కిట్స్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిషన్‌రావు, సిబ్బంది ఎల్లయ్య, ఎఫ్ఏ మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీడ ఏర్పాటు చేయాలి

హుస్నాబాద్‌రూరల్: గ్రామాల్లో ఉపాధిహామీ పనులు జరిగే చోట కూలీలకు ఎండదెబ్బ తగలకుండా నీడ ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. కూచనపెల్లి, పందిల్ల గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. చలువ పందిర్లు ఏర్పాటు చేసి కూలీలకు రక్షణ కల్పించాలన్నారు.